క్లుప్తంగా

అభయ ప్రదాయినిగా కొమ్మే పెల్లమ్మ



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

యాదమరి: భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా, అభయ ప్రదాయినిగా కొమ్మే పెల్లమ్మ కొలువై ఉందని ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రచేను వద్ద కొమ్మేపెల్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి వేదపండితులచే ప్రత్యేక అభిషేకాలు, ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు చేశారు. అనంతరం భక్తులకు విశ్వరూప దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఉమాపతిరెడ్డి మృతి చాలా బాధాకరం



నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: ఉమాపతిరెడ్డి మృతి చెందడం చాలా బాధాకరమని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని వసంతాపురానికి చెందిన మాజీ సైనికోద్యోగి ఉమాపతిరెడ్డి(73) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన నేడు మన మధ్య నుంచి లేకపోవడం బాధాకరంగా ఉందన్నారు. అనంతరం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు సర్పంచ్ రజనీకాంత్, గ్రామస్తులు ఉన్నారు.

భక్తులకు అన్నదానం



కార్వేటినగరం: శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ కార్వేటినగరానికి చెందిన దాతలు ఎ.రాజేంద్ర, ఎ.రజనీ దంపతులు ఆదివారం అన్నదానం చేపట్టారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్, దాతలు రాజేంద్ర, రజనీ వారి కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



కాణిపాకం: ఆలయంలో ఆకట్టుకుంటున్న ఉగాది తోరణం



కాణిపాకం: ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ



తవణంపల్లె: అర్ధగిరి క్షేత్రంలో ఉగాది పంచాంగ శ్రవణం

విశ్వావసు.. షడ్రుచుల సంబరం

- కాణిపాకంలో వైభవంగా ఉగాది వేడుకలు
- పుష్పాలంకరణ, అరటి, మామిడి తోరణాలతో స్వాగతం
- భారీగా తరలివచ్చిన భక్తజనం

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో తెలుగు సంవత్సరాది ఉగాది సంబరాలు అంబరాన్ని తాకాయి. విశ్వావసు నామసంవత్సరానికి ఆదివారం జిల్లావాసులు షడ్రుచులతో ఘన స్వాగతం పలికారు. ఇళ్ల వాకిళ్లకు మామిడి తోరణాలు కట్టి అందంగా ముస్తాబు చేశారు. షడ్రుచుల ఉగాది పచ్చడి రుచి చూశారు. భక్తుల రాకతో ఆలయం ఉగాది శోభను సంతరించుకుంది. ఆలయాన్ని విదేశీ పుష్పాలతో సుందరంగా అలకరించారు. కొబ్బరి, మామిడి ఆకుల పచ్చని తోరణాలు ఆహ్లాదాన్ని అందించాయి. ఈ అలంకరణలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు అభిషేక, పూజలు కొనసాగాయి. పంచాంగ శ్రవణంను పురోహితులు శ్రద్ధగా, భక్తులకు అర్థమయ్యేరీతిలో వినిపించారు. ముందుగా ఉత్సవమూర్తులు విశేష అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆ వేదికగా పంచాంగ శ్రవణం వినిపించి ప్రముఖులకు ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచల కిషోర్‌లు, వేదపండితులు పంచాంగ శ్రవణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆలయం

కాణిపాకం ఆలయం వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం కావడం, ఉగాది పర్వదినంతో భక్తజనంతో ఆలయం కిక్కిరిసిపోయింది. వేకువజామునుంచే భక్తులు దర్శనార్థం క్యూకట్టారు. అలా భక్తులు స్వామి దర్శనం కోసం ముందుకు సాగుతూ గణేశ నామస్మరణలతో మార్మోగించారు. రాత్రి వరకు కూడా రద్దీగా కనిపించింది.



కాణిపాకం: ఆలయంలో పుష్పతోరణాలు



బంగారుపాళెం: పంచాంగ పఠనంలో అర్చకుడు

పులిహోర ప్యాకింగ్ మిషన్‌కు విరాళం

దేవస్థానంలో భక్తులకు అందించే పులిహోర ప్యాకింగ్ మిషన్ కొనుగోలుకు కాణిపాకానికి చెందిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రభాకరన్, ఆర్‌ఎం విష్ణుచరణ్ రూ.1.95 లక్షల డీడీని ఈవో పెంచల కిషోర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు రవీంద్రబాబు,సీఎఫ్‌ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఉగాది సంబరాలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. శాస్త్రోక్తంగా స్వామికి పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా అర్చకులు పంచాగం శ్రవణం పఠనం చేసి భక్తులకు వినిపించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, ఉచితంగా తీర్థప్రసాదాలు అందజేశారు.

అరగొండ కోదండరామాలయంలో..

మండలంలోని అరగొండ కోదండరామాలయంలో ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారామ లక్ష్మణులకు భక్తిప్రపత్తులతో భక్తులు పూజలు చేయించారు. తర్వాత అర్చకులు ఉగాధి పంచాగ శ్రవణం నిర్వహించారు. మండలంలోని జొన్నగురకలలో వెలసిన విరుపాక్షమ్మ ఆలయంలో అమ్మ వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు

బంగారుపాళెం: మండలంలో తెలుగు ప్రజలు ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర (ఉగాది) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని ప్రధాన దేవాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మొగిలి శివాలయం, మొగిలివెంకటగిరిలోని శ్రీకోదండరామాలయం, నలగాంపల్లెలోని శ్రీభూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయం, వజ్రాలపురంలోని జలకంఠేశ్వరస్వామి ఆలయం, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొత్త సంవత్సరంలో సర్వశుభాలు కలగాలని భక్తులు పూజలు చేపట్టారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. మొగిలి శివాలయం, బంగారుపాళెం ముత్యాలమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీ కామాక్షి అంబికా సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాది పూజలు నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం శ్రీ కాలభైరవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూలవర్లకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శివ కుమార్, శ్రీ కాలభైరవ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్, టీడీపీ నాయకులు వసంత కుమార్ పాల్గొన్నారు.



తవణంపల్లె: ప్రత్యేక అలంకరణలో విరూపాక్షమ్మ



అరగొండలో ఉగాది సంబరాలు



కాణిపాకం: పంచాంగ పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం



నగదు విరాళం ఇస్తున్న దాత



పూజా కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, నిర్వాహకులు



వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ప్రసూతి.. కానరాని వసతి

- ఫ్యాన్లు తిరిగినా గాలి రాక ఉక్కిరిబిక్కిరి
- వేసవి సెగలతో తల్లడిల్లుతున్న తల్లులు
- సొంతంగా టేబుల్ ఫ్యాన్లు తెచ్చుకుంటున్న వైనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సూర్యదేవుడు నిప్పులు కక్కుతున్నాడు. ఎండలు భగభగ మండుతున్నాయి. ఈ కారణంగా జిల్లా ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలో సరైన సౌకర్యాల్లేక మాతృమూర్తులు అల్లాడిపోతున్నారు. బాలింతల వార్డుల్లో ఫ్యాన్లు సక్రమంగా తిరగడం లేదు. ఏసీలు ఎక్కడా కనిపించడం లేదు.. పలు విభాగాల్లో కిటికీల జాలీలు లేక వడగాలులు వీస్తున్నాయి. ఎండ పెరిగినా ఆస్పత్రుల్లో ముందస్తు చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం చోద్యం చూస్తోంది. బాలింతల సహాయకులకు విశ్రాంత గదులు లేకపోవడంతో ఆరుబయట కునుకు తీస్తున్నారు.

తిరగని ఫ్యాన్లు

చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలో వేసవి సెగలు పుట్టిస్తోంది. ఇక్కడ ప్రసూతి సేవలకు కోసం రోజుకు 20 నుంచి 30 మంది వస్తుంటారు. ఇందులో 10 నుంచి 15వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. అలాగే 400 పడకలు ఉండగా ఇన్‌పేషెంట్లు 250 నుంచి 300 మంది వరకు ఉంటున్నారు. అయితే వారికి అక్కడ సరైన వసతులు లేక ఇబ్బందిపడుతున్నారు. సుమారు అన్ని విభాగాల్లో 300కుపైగా ఫ్యాన్లు ఉన్నాయి. ఇందులో చాలా వరకు పనిచేయడం లేదు. కొన్ని తిరుగుతున్నప్పటికీ గాలి మాత్రం రావడంలేదు. దీంతో ఆయా వార్డుల్లో ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బాలింతలు, గర్భిణిల వార్డుల్లో ఫ్యాన్లు సక్రమంగా తిరగక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇంట్లో నుంచి సొంతంగా టేబుల్ ఫ్యాన్లు తెచ్చుకుని అలా కాస్త ఉపశమనం పొందుతున్నారు.



ప్రసూతి విభాగంలో టేబుల్ ఫ్యాన్లు తెచ్చుకున్న బాలింతలు

గొంత తడపడం లేదు

వేసవి ముంచుకొస్తున్నా ఆస్పత్రిల్లో తాగునీటి సమస్య వెంటాడుతోంది. వార్డుల్లో గుక్కెడు నీళ్ల దొరకడం కష్టతరంగా మారింది. రోగులు వారి సహాయకులు ఆస్పత్రి ఆవరణలో విక్రయించే వాటర్ బాటిళ్లతో గొంతు తడుపుకుంటున్నారు. ఈ ఖర్చులే రోజుకు రూ. 100 నుంచి రూ.200 వరకు అవుతున్నాయి. ఆస్పత్రి అధికారులు వార్డులకు పూర్తి స్థాయిలో తాగునీటి సాయం అందించాలని పలువురు వేడుకుంటున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తాం

ఫ్యాన్లు చాలా చోట్ల మరమ్మతులు చేయించాం. ఎక్కడక్కడ రిపేర్లు అయ్యాయో మళ్లీ చూస్తాం. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. ప్రసూతి విభాగంలో సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తాం. అక్కడ కూడా పూర్తి స్థాయిలో ఫ్యాన్లు బిగించాం. ఇంకేమైనా సమస్యలుంటే విచారించి చర్యలు తీసుకుంటాం.

–అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



మరుగుదొడ్లకు అడ్డంగా కట్టిన పరదాలు

మరుగు లేని మరుగుదొడ్లు

ప్రసూతి, జనరల్ వార్డుల్లో అడ్మిట్‌లో ఉండే సహాయకులకు కూడా సరిపడా వసతులు లేవు. మరుగుదొడ్లకు అడ్డుగా పరదాలు కట్టాల్సిన దుస్థితి. దీంతో మూత్ర విసర్జనకు ఆరుబయటకు పరుగులు తీస్తున్నారు. దీని కారణంగా అడ్మిట్‌లో ఉండే వ్యక్తుల పక్కన కాసేపు కూర్చువాలంటే ముఖం చాటేస్తున్నారు. అలా ఆరు బయటకు వచ్చేస్తున్నారు. చెట్ల కింద, ఆరుబయట ఉన్న చిన్న పార్కు, ఆస్పత్రి ఆవరణలో నిద్రించాల్సిన దుస్థితి నెలకొంది. కిటికీలకు పలు విభాగాల్లో అక్కడక్కడ పరదాలు కట్టారు.

అవ్వాతాతల వేలిముద్ర పడేనా?

- పంపిణీ కోసం కొత్త స్కానింగ్ యంత్రాలు
- గుడిపాల మండలానికి 130 యూనిట్లు పంపిణీ

గుడిపాల: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో సాంకేతిక సమస్యలు లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సిబ్బందిని సైతం ముందుకు వెళ్లకుండా చేస్తున్నాయి. ఈ సమస్యను గట్టెక్కించేందుకు అధికారులు కొత్తగా అధునాతన వేలిముద్ర(ఎంఎఫ్ఎస్ 110, ఎల్–1 ఫింగర్ ప్రింట్) స్కానర్లను గుడిపాల పరిధిలో 17 సచివాలయాలకు సమకూర్చారు. వీటితో అయినా ఏప్రిల్ నుంచి పింఛన్ల పంపిణీ కష్టాలు తీరుతాయో లేదోనన్న బెంగ లబ్ధిదారులను వెంటాడుతోంది.మండల పరిధిలో 17 సచివాలయాల్లో అర్హులైన పింఛనుదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. పాత బయోమెట్రిక్ పరికరాలతో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వేలిముద్రలు సరిగ్గా పడక కొంతమంది అవస్థలు పడుతున్నారు. సచివాలయాల చుట్టూ రెండు, మూడు సార్లు తిరిగి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ముఖ్యంగా వృద్ధుల వేలిముద్రలు పడకపోవడం, తరచూ స్కానర్లు మరమ్మతులకు గురవుతుండడం, సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో పింఛన్ల పంపిణీ ప్రక్రియ అనుకున్నంత వేగంగా జరగకపోవడంతో అటు లబ్ధిదారులు, ఇటు సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది. వేలిముద్రలు పడని వారికి అధికారుల ప్రత్యేక అనుమతితో సిబ్బంది ఆ తర్వాత పింఛను డబ్బులు అందించాల్సి వస్తుంది. కొత్త ఎల్–1 వేలిముద్ర స్కానర్లతో వేలిముద్రల నమోదు సమస్య పరిష్కారమవుతుందని మండల అధికారులు అభిప్రాయ పడుతున్నారు. సచివాలయ సిబ్బంది కొత్తగా అందించిన వేలిముద్రల స్కానర్లతోనే ఏప్రిల్ నెల పింఛన్లు అందజేస్తారని తెలిపారు.



పింఛన్ల పంపిణీ కోసం కొత్తగా వచ్చిన వేలిముద్రల స్కానర్

లాభాల గులాబి



మెట్ట ప్రాంతంలో సాగవుతున్న రోజా పూల తోట

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో చెరువుముందర కండ్రిగ గ్రామాల్లో మెట్ట భూముల్లో ఆధునిక సేద్యంతో రైతులు రోజా, గులాబీ, మల్లెపూల తోటలు సాగు చేస్తున్నారు. ఒక్కసారి నాటితే ఐదేళ్లపాటు దిగుబడి రాబడి వచ్చే చిట్టి రోజాలను డ్రిప్ సౌకర్యంతో సాగు చేస్తూ రోజా రాబడిని కళ్లజూస్తున్నారు. రోజా సాగుతోపాటు చిక్కుడు, బెండ, మిరప పంటలను కూడా ఇదే తరహాలో సాగు చేస్తున్నారు. చెరువుముందర కండ్రిగ గ్రామానికి చెందిన వడివేల్‌రెడ్డి రైతులకు పూల సాగులో ఆదర్శంగా నిలుస్తున్నాడు.

సాగు విధానం

ముందుగా భూమిని దుక్కిచేసి పశువుల ఎరువులతో సారవంతం చేసుకోవాలి. భూమిని మెత్తగా చేసుకుని బోదెలు ఏర్పాటు చేయాలి. ఎకరాకు 3 వేల మొక్కలు నాటుకోవాలి. మొక్కకు మొక్కకు మధ్య 1.5 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. నీరు ఇంకే తేలికపాటి నేలలు, సూర్యరశ్మి బాగా తగిలే వాతావరణం రోజా మొక్కల పెంపకానికి అనుకూలం. రోజా పూల మొక్కలను ఎప్పుడైనా నాటుకోవచ్చు. ఎండా కాలంలో అయితే నీటి వసతి లేకపోవడం, ఎండలు తీవ్రంగా ఉంటాయి. కాబట్టి వర్షాలు పడే సమయం (సెప్టెంబరు–అక్టోబరు మధ్య కాలం)లో నాటుకుంటే మంచిది. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటుకోవాలి. ఇందుకు మరో 500 మొక్కలు అవసరమవుతాయి.

ఖర్చు–రాబడి

చిట్టిగులాబి, రోజా (మీనియేచర్ రకం)మొక్క రూ.20 బెంగళూరు, తమిళనాడు క్రిష్ణగిరి నుంచి తెప్పించుకోవాలి. ఎకరా మొక్కల కోసం రూ.60 వేల పెట్టుబడి అవుతుంది. తొలి ఏడాది ఇతర ఖర్చులు మరో రూ.60 వేల వరకు అవుతాయి. తర్వాత సంవత్సరం నుంచి ఎకరాకు సుమారు రూ.45 వేల ఖర్చు అవుతుంది. ఒక్కసారి నాటుకుంటే ఐదేళ్ల పాటు పూల దిగుబడి వస్తుంది. ప్రతి రోజు 20 నుంచి 30 కేజీల పూల దిగుబడి వస్తుంది. ప్రస్తుత మార్కెట్‌ను బట్టి సగటున రోజుకు రూ.2 వేల వరకు రాబడి వస్తుంది.